సాక్షి విజయనగరం

గురువారం । 19 । సెప్టెంబర్ । 2024



అదరగొట్టిన అక్కాచెల్లెళ్లు

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో నెల్లిమర్ల మండలం కొండవెలగాడకు చెందిన అక్కాచెల్లెళ్లు అదరగొట్టారు. - 8లో



పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జీఎంఆర్ ఐటీ విద్యార్థుల ప్రతిభ - 8లో

రాజాం జీఎంఆర్ ఐటీ విద్యార్థులు అంతర్ జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీలో చక్కని ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు.

జిల్లా రిజిస్ట్రార్‌కు బదిలీ

విజయనగరం రూరల్: జిల్లా రిజిస్ట్రార్ ఏ.వి.కుమారికి నెల్లూరు జిల్లా రిజిస్ట్రార్‌గా బదిలీ అయింది. దీనికి సంబంధించిన ఉత్వర్వులు బుధవారం సాయంత్రం ఆమెకు అందాయి. విజయనగరం జిల్లా రిజిస్ట్రాగా ఎవరు చేరనున్నారన్నది ఇంకా తెలియరాలేదు.

తమ్ముళ్లూ వచ్చేది మంచి పాలన. సూపర్ సిక్స్‌తో అందరినీ ఆదుకుంటాం. నిరుద్యోగులకు ఉద్యోగం వచ్చేవరకు రూ.3వేలు నిరుద్యోగభృతి ఇస్తాం, 20 లక్షల ఉద్యోగాలు భర్తీచేస్తాం.. బడికి వెళ్లే ప్రతీ విద్యార్థికి రూ.15వేలు చొప్పున అందజేస్తాం.. మహిళలకు బస్సు ఫ్రీ.. పేద కుటుంబాలకు ఏడాదికి మూడు గ్యాస్ బండలు ఉచితం.. 19 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మహిళలందరికీ నెలకు రూ.1500 చొప్పున ఇస్తాం.. రైతన్నకు పెట్టుబడి భరోసాతో ఆదుకుంటాం.. అధికారంలోకి వచ్చిన నుంచి పథకాలన్నీ అమలుచేస్తాం.. ఇంటింటికీ వెళ్ల మన సూపర్ సిక్స్ పథకాల గురించి చెప్పండి.

- ఏప్రిల్ 24వ తేదీన విజయనగరం నడిబొడ్డున జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌తో కలిసి చంద్రబాబు సూపర్ సిక్స్ గురించి పదేపదే చెప్పిన మాటలివి.



మన సూపర్ సిక్స్ పథకాలను చూసి వైఎస్సార్‌సీపీకి వణుకుపుడుతోంది. అధికారంలోకి వస్తాం.. పక్కాగా సూపర్ సిక్స్ పథకాలు అమలుచేస్తాం. నిరుద్యోగులందరూ గుర్తించుకోండి.. ఉద్యోగాలు వచ్చేవరకు నిరుద్యోగ భృతికింద రూ.3వేలు ఇస్తాం. ఇది ఫిక్స్.

- పోలిపల్లి సాక్షిగా 2023 డిసెంబర్ 20వ తేదీన నారాలోకేశ్ ఇచ్చిన హామీ ఇది.



తక్షణమే అమలు చేయాలి...



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వెంటనే ఎన్నికల హామీలను అమలు చేస్తామని చంద్రబాబు, పవన్‌కల్యాణ్ విజయనగరంలో మీటింగ్ పెట్టి చెప్పారు. ఆ మాటలు నమ్మి ఓట్లు వేశాం. అధికారంలోకి వచ్చి వంద రోజులు కావొస్తున్నా 19 సంవత్సరాల నుంచి 59 ఏళ్లలోపు వయస్సు గల మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఇస్తామన్న హామీ అమలుచేయట్లేదు. కనీసం ఆ దిశగా కూటమి ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు కూడా లేదు. ఎన్నికలకు ముందు ఒకలా గెలిచిన తరువాత మరోలా నడుచుకోవడం సరికాదు.

- జి.నారీమణి, కొత్తపేట, విజయనగరం

సూపర్ 6 సూపర్ సిక్స్ మోసం ఫిక్స్!

- టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో ఘనం
- అధికారంలోకి వచ్చాక అమలే గగనం
- సూపర్ 6 పక్కా అని ఊదరగొట్టిన హామీలకూ ఎగనామం
- చూస్తే భయమేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు మొసలికన్నీరు

అధికారంలోకి వచ్చి వంద రోజులు కావస్తోంది. సూపర్ సిక్స్ అంటూ చంద్రబాబునాయుడు ప్రజలకిచ్చిన హామీల్లో ఒక్కటంటే ఒక్కటీ అమలుకు నోచుకోలేదు. విద్యాసంవత్సరం ఆరంభమై మూడు నెలలు పూర్తయినా తల్లికి వందనం అందని దుస్థితి. ఖరీఫ్ పంటలు సాగుచేస్తున్న రైతన్నచేతికి అందని భరోసా. తెలంగాణాలో అధికారంలోకి వచ్చిన వెంటనే అమల్లోకి వచ్చిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇక్కడ ఎండమావిగానే మిగిలింది. సూపర్ సిక్స్‌లోని నిరుద్యోగ భృతి, మహిళలకు నెలకు రూ.1500, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీది అదే పరిస్థితి. దీనిని చూసిన విజయనగరం జిల్లా ప్రజలు.. బాబు మారలేదు.. మనమే మోసపోయామని నిట్టూర్చుతున్నారు. సూపర్ సిక్స్ అంటూ మోసం ఫిక్స్‌చేశారని వాపోతున్నారు. పథకాలు ఎందుకు అమలుచేయడం లేదంటూ గల్లీ నాయకులతో పాటు రాష్ట్రస్థాయి లీడర్లను నిలదీస్తున్నా ఫలితం శూన్యంగానే కనిపిస్తోంది. అసలు పథకాలను అమలుచేస్తారా? లేదా? అన్న సందేహం వ్యక్తమవుతోంది.


- సాక్షిప్రతినిధి, విజయనగరం



విజయనగరం జిల్లాలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను వివరిస్తూ ఈనాడులో ప్రచురితమైన వార్త

మరి చంద్రబాబు పాలనలో?

సొంత మామ అయిన ఎన్టీఆర్‌కు వెన్నుపోటుతో 1995లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అధికారం పీఠం ఎక్కినప్పటి నుంచి ఇప్పటివరకూ నాలుగుసార్లు ముఖ్యమంత్రి అయినా చంద్రబాబునాయుడు హయాంలో విజయనగరం జిల్లాకు జరిగిన మేలు ఒక్కటీ కనిపించదు. సూపర్ 6 హామీలను పక్కాగా అమలుచేస్తామని చెబితే జిల్లా ప్రజలు నమ్మి మరోసారి పట్టం కట్టారు. కానీ ఈసారీ మోసపోయామనే ప్రజలు భావిస్తున్నారు. మహిళలకు ప్రతీ నెలా రూ.1,500 చొప్పున ఆర్థిక సాయం రూ.155.08 కోట్లు, నిరుద్యోగ భృతి రూ.176.72 కోట్లు, తల్లికి వందనం పథకంతో రూ.384.82 కోట్లు, రైతు సాయం రూ.548.5 కోట్లు ఇప్పటికే జిల్లా ప్రజలకు అందాలి. కానీ ఇప్పటివరకూ ఆ దిశగా అడుగులే పడలేదు. ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్లు పథకం సుమారు 60 వేల మందికి, ఉచిత బస్సు దాదాపు 8.45 లక్షల మంది మహిళలకు ఉపయోగపడాలి. అవేవీ ఇప్పట్లో అమలయ్యేలా కనిపించట్లేదు.



సూపర్ సిక్స్ కింద జిల్లాప్రజలకు కలగాల్సిన లబ్ధి ఇలా...

రైతు సాయం

నియోజకవర్గం	లబ్ధిదారులు	రావాల్సిన సాయం
విజయనగరం	5,500	రూ. 11.00 కోటు
ఎస్.కోట	46,392	రూ. 92.78 కోట్లు
నెల్లిమర్ల	32,533	రూ. 65.66 కోట్లు
గజపతినగరం	48,397	రూ. 96.74 కోట్లు
బొబ్బిలి	41.242	రూ. 93.58 కోట్లు
రాజాం	45,768	రూ. 91.53 కోట్లు
చీపురుపల్లి	48,605	రూ. 97.21 కోట్లు
మొత్తం	2,68,437	రూ. 548.5 కోట్లు

మహిళలకు ప్రతీ నెల రూ.1500

నియోజకవర్గం	లబ్ధిదారులు	రావాల్సిన సాయం
విజయనగరం	42,217	రూ.70.82 కోట్లు
ఎస్.కోట	1,04,476	రూ.15.67 కోట్లు
నెల్లిమర్ల	96,342	రూ. 14.45 కోట్లు
గజపతినగరం	101648	రూ.15.24 కోట్లు
బొబ్బిలి	90,488	రూ. 13.57 కోట్లు
రాజాం	82,990	రూ. 12.44 కోట్లు
చీపురుపల్లి	85,958	రూ. 12.89 కోట్లు
మొత్తం	5,10,089	రూ.155.08 కోట్లు

నిరుద్యోగ భృతి

నియోజకవర్గం	లబ్ధిదారులు	అందాల్సిన సాయం
విజయనగరం	87,413	రూ. 26.22 కోట్లు
ఎస్.కోట	71,792	రూ. 21.53 కోట్లు
నెల్లిమర్ల	19,842	రూ. 59.52 కోట్లు
గజపతినగరం	40,234	రూ. 12.70కోట్లు
బొబ్బిలి	60,176	రూ. 18.05కోట్లు
రాజాం	72,666	రూ. 21.79 కోట్లు
చీపురుపల్లి	56,396	రూ. 16.91కోట్లు
మొత్తం	3,43,119	రూ. 176.72 కోట్లు

గ్యాస్ సిలండర్లు

నియోజకవర్గం	లబ్ధిదారులు
విజయనగరం	87,413
ఎస్.కోట	71,792
నెల్లిమర్ల	95,172
గజపతినగరం	90,256
బొబ్బిలి	1,11,444
రాజాం	83,195
చీపురుపల్లి	60,124
మొత్తం	5,99,396

ఉచిత బస్సు

నియోజకవర్గం	లబ్ధిదారులు
విజయనగరం	1,57,600
ఎస్.కోట	1,22,246
నెల్లిమర్ల	1,01,857
గజపతినగరం	1,01,648
బొబ్బిలి	1,12,437
రాజాం	1,42,584
చీపురుపల్లి	1,07,550
మొత్తం	8,45,922

తల్లికి వందనం

నియోజకవర్గం	లబ్ధిదారులు	అందాల్సిన సాయం
విజయనగరం	45,656	రూ. 68.48కోట్లు
ఎస్.కోట	28,489	రూ. 42.73 కోట్లు
నెల్లిమర్ల	20,509	రూ. 30.76 కోట్లు
గజపతినగరం	46,716	రూ.70.74కోట్లు
బొబ్బిలి	1,09,039	రూ.76.15కోట్లు
రాజాం	38,000	రూ. 57.00 కోటు
చీపురుపల్లి	25,976	రూ. 38.96 కోట్లు
మొత్తం	3,14,385	రూ.384.82కోట్లు

ఉచిత బస్సు ఊసు మరిచిపోయారా?



ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా, హాయిగా రాష్ట్రంలో ఎక్కడికైనా ప్రయాణించవచ్చంటూ మహిళలందరికీ చంద్రబాబు, టీడీపీ నాయకులు పదేపదే చెప్పారు. అధికారంలోకి వచ్చాక ఆ ఉచిత బస్సు ప్రయాణం ఊసు మరిచిపోయారా? అన్న సందేహం కలుగుతోంది.

- చింతల సత్యవతి, శృంగవరపుకోట



జగన్ పాలనలో మారిన జీవితాలెన్నో...

ఒకప్పుడు వలసలకు, వెనుకబాటుతనానికి విజయనగరం జిల్లా నిలువెత్తు సాక్ష్యం. దశాబ్దాల పాటు టీడీపీ నాయకులను భుజాలపై మోసిన ఈ జిల్లా ప్రజలకు కష్టాలు తీరలేదు. ఇళ్ల దగ్గర పిల్లలను, వృద్ధులను వదిలిపెట్టి పొట్టచేతపట్టుకొని హైదరాబాద్, చెన్నై ఇలా ఉపాధి ఎక్కడ దొరికితే అక్కడికి మూటముల్లె సర్దుకొని వెళ్లిపోవడమే కనిపించేది. అలాంటి నేపథ్యంలో 2019 ఏప్రిల్‌లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన ప్రతి పథకం ప్రజలకు నేరుగా చేరింది. సచివాలయ వ్యవస్థ ద్వారా పైసా లంచం లేకుండా ఎంతో పారదర్శకంగా అందిన ఆ పథకాలు నిజంగా నవరత్నాలే. జగన్ పాలన ఐదేళ్లలోనూ ఒక్క మన జిల్లాలోనే రూ.18,591 కోట్లు ప్రజలకు అందాయి. కరోనా మహమ్మారి కాలంలోనూ ఇదంతా చేస్తూనే మరోవైపు అభివృద్ధినీ పరుగుపెట్టించారు. 'నాడు-నేడు'తో గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేఖలు మారాయి. విత్తనాలు, ఎరువుల కొనుగోలు నుంచి చేతికొచ్చిన పంట అమ్ముకోవడం వరకూ గత టీడీపీ పాలనలో రైతులు పడిన అష్టకష్టాలన్నీ రైతుభరోసా కేంద్రాలతో తీరిపోయాయి. భోగాపురం వద్ద అంతర్జాతీయ విమానాశ్రయ పనులు 34 శాతం పూర్తయ్యాయి. విశాఖపట్నం-రాయ్‌పూర్ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి సిద్ధమైంది. రూ.500 కోట్లతో విజయనగరం ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణం, గిరిజన వర్సిటీకి శంకుస్థాపన, జేఎన్‌టీయూను విశ్వవిద్యాలయంగా మార్పుచేయడం... ఇవన్నీ గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించిన వరాలే.

నాడు ఠంచన్‌గా అమ్మఒడి



వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మాకు క్రమంతప్పకుండా అమ్మఒడి డబ్బులు ఇచ్చారు. టీడీపీ నాయకులు ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామన్నారు. ఓట్లేయించుకున్నారు. అధికారంలోకి వచ్చాక ఇప్పటికీ అతీగతీ లేదు. నాకు ఇద్దరు పిల్లలు. పాప షర్మిళ నాలుగో తరగతి, బాబు కౌశిక్ రెండో తరగతి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నారు. చంద్రబాబు చెప్పినట్లు ఇస్తే నాకు రూ.30 వేలు రావాలి.

- మీసాల శారద, మెట్టపల్లి, చీపురుపల్లి మండలం

వైఎస్సార్ సీపీ పాలనలో కలిగిన లబ్ధి ఇలా..

పథకం	లబ్ధిదారుల సంఖ్య	ఆర్థిక ప్రయోజనం
డ్వాక్రా బ్యాంకు లింకేజీ రుణాలు	4,75,032	రూ.6,319.07 కోట్లు
వైఎస్సార్ పింఛను కానుక	2,82,748	రూ.4,523.39 కోట్లు
వైఎస్సార్ రైతు భరోసా	2,63,394	రూ.1,879.19 కోట్లు
జగనన్న అమ్మ ఒడి	6,76,226	రూ.1,263.61 కోట్లు
స్త్రీనిధి	43,243	రూ.825.71 కోట్లు
వైఎస్సార్ ఆసరా	4,20,619	రూ.754.05 కోట్లు
డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ	2,53,720	రూ.587.49 కోట్లు
వైఎస్సార్ చేయూత	1,77,530	రూ.534.19 కోట్లు
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	1,16,198	రూ.501.97 కోట్లు
వైఎస్సార్ సున్నావడ్డీ	4,59,359	రూ.209.32 కోట్లు
జగనన్న విద్యాకానుక	1,73,364	రూ.156.48 కోట్లు
జగనన్న గోరుముద్ద	7,30,017	రూ.142.44 కోట్లు
వైఎస్సార్ చేయూత (జగనన్న పాలవెల్లువ)	18,855	రూ.141.41 కోట్లు
జగనన్న తోడు	1,11,345	రూ.127.48 కోట్లు
జగనన్న చేదోడు	17,245	రూ.97.97 కోట్లు
వైఎస్సార్ బీమా	4,846	రూ.80.87 కోట్లు
వైఎస్సార్ వాహనమిత్ర	63,044	రూ.77.765 కోట్లు
జగనన్న విద్యాదీవెన	17,996	రూ.74.81 కోట్లు
వైఎస్సార్ కాపునేస్తం	5,905	రూ.41.52 కోట్లు
ఉన్నతి (ఎస్సీఎస్పీ అండ్ టీఎస్పీ)	7,172	రూ.36.745 కోట్లు
డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా	37,497	రూ.33.08 కోట్లు
వైఎస్సార్ పశునష్ట పరిహార పథకం	6,435	రూ.29.87 కోట్లు
వైఎస్సార్ చేయూత (జగనన్న జీవక్రాంతి)	3,489	రూ.26.17 కోట్లు
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	5,738	రూ.24.77 కోట్లు
వైఎస్సార్ యంత్రసేవ	2,550	రూ.18.88 కోట్లు
వైఎస్సార్ మత్స్యకార భరోసా	14,218	రూ.17.72 కోట్లు
సున్నా వడ్డీ పంటరుణాలు	1,14,999	రూ.17.13 కోట్లు
జగనన్న వసతిదీవెన	15,897	రూ.12.90 కోట్లు
పాస్టర్లకు గౌరవ భృతి	142	రూ.8.20 కోట్లు
వైఎస్సార్ నేతన్న నేస్తం	754	రూ.6.80 కోట్లు
టీఎంఆర్ (పశుగ్రాసం పంపిణీ)	14,798	రూ.5.04 కోట్లు
ఇమామ్‌లకు గౌరవభృతి	94	రూ.4.64 కోట్లు
జగనన్న తోడు (వడ్డీ మాఫీ)	1,11,636	రూ.2.66 కోట్లు
జననీసురక్ష యోజన	18,899	రూ.2.26 కోట్లు
హెచ్ఎస్‌డీ ఆయిల్ సబ్సిడీ	1,634	రూ.1.814 కోట్లు
వైఎస్సార్ పశు బీమా	8,826	రూ.1.47 కోట్లు
గడ్డి విత్తనాల పంపిణీ	16,907	రూ.0.89 కోట్లు
మత్స్యకారులకు ఎక్స్‌గ్రేషియా	8	రూ.0.50 కోట్లు
పశుగ్రాస కత్తిరింపు యంత్రాలు	112	రూ.0.386 కోట్లు
ఐదేళ్లలో మొత్తం లబ్ధి		రూ.18,591.32 కోట్లు

ఆర్థిక సాయం అందేనా?



ప్రతీ మహిళకు ప్రతినెలా రూ.1500 చొప్పున ఇస్తామని చంద్రబాబు చెప్పి అధికారంలోకి వచ్చారు. ఇంతవరకూ ఇస్తారో ఇవ్వరో చెప్పలేదు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు వైఎస్సార్ చేయూత పథకంలో ప్రతీ మహిళకు ఆర్థికసాయం అందేది. కోవిడ్ సమయంలోనూ ఇచ్చారు. గత ప్రభుత్వం విడుదల చేసిన డబ్బులు కూడా కూటమి ప్రభుత్వం వచ్చాక చాలామందికి అందలేదు.

- జరజాన లక్ష్మి, మారేదుబాక, రాజాం మండలం

రైతులను రాజును చేసేది ఇలాగేనా?



గత ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ నాటికి రైతుల ఖాతాల్లోకి పెట్టుబడి సాయం జమయ్యేది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పెంచి ఇస్తామన్న పెట్టుబడి సాయం రూ.20 వేల పరిస్థితి ఏమిటనేదీ ఇప్పటివరకూ విధివిధానాలు చెప్పలేదు. ఇప్పటికే విత్తనాలు, ఎరువుల కోసం అప్పులు చేశాం. రైతులను రాజును చేసేది ఇలాగేనా?

- కోరాడ వెంకటరమణ, రైతు, పూసపాటిరేగ

గ్యాస్ సిలెండర్‌లు ఏవీ?



ప్రతి ఇంటికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా ఇస్తామని ప్రతి మీటింగ్‌లోనూ చంద్రబాబు సహా టీడీపీ నాయకులంతా చెప్పారు. తీరా అధికారంలోకి వచ్చి దాదాపు 2 నెలలవుతున్నా ఇప్పటివరకూ ఆ ఊసే తేలేదు.

- కిల్లాడ రాజేశ్వరి, వంగర, దత్తిరాజేరు మండలం

నిరుద్యోగ భృతి వస్తుందా?



నిరుద్యోగులకు ప్రతీ నెలా ఉద్యోగం వచ్చేవరకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. అధికారం చేపట్టి వందరోజులవుతున్నా ఆ హామీని పట్టించుకోవడంలేదు. చంద్రబాబు నిరుద్యోగులను మళ్లీ మోసం చేస్తున్నారు.

- పట్నాయకుని శ్రావణ్‌కుమార్, బొబ్బిలి

క్లుప్తంగా

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతి

విజయనగరం క్రైమ్: మండల పరిధిలోని సారిక గ్రామంలో గల చెరువులో ఈతకు వెళ్లిన ఐదుగురులో గల్లంతైన వ్యక్తి (తోట సూరిబాబు) మృతి చెందినట్లు రూరల్ ఎస్సై వి.అశోక్‌కుమార్ బుధవారం తెలిపారు. మంగళవారం సాయంత్రం గల్లంతు కాగా అప్పటి నుంచి పోలీసులు గజ ఈతగాళ్లచే గాలింపు చేపట్టగా బుధవారం మృతదేహం లభించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్‌కుమార్ తెలిపారు.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య


యోగీశ్వరరావు (ఫైల్)

రేగిడి: మండలంలోని ఏవీపురం గ్రామానికి చెందిన ఇంజినీరింగ్(బీటెక్) చదువుతున్న విద్యార్థి గోగుల యోగీశ్వరరావు(20) బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై ఎస్సై పి.నీలావతి తెలిపిన వివరాల ప్రకారం రాజాంలోని ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో యోగీశ్వరరావు బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్నాడు. చదువులో వెనుకబడుతున్నాననే భావనతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటిపై ఉన్న రూమ్‌లో ఉరివేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కామినాయుడు, సత్యవతి గగ్గోలు పెట్టగా, చుట్టుపక్కల ప్రజలు వచ్చి తలుపులు పగలగొట్టి యోగీశ్వరరావును కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే మృతిచెందాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని, తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నామని ఎస్సై తెలియజేశారు. యోగీశ్వరరావు మృతదేహాన్ని చూసేందుకు అతని స్నేహితులు తండోపతండాలుగా ఏవీపురం గ్రామానికి చేరుకున్నారు.

శతాధిక వృద్ధుడి మృతి


వావిలపల్లి బంగారినాయుడు

రేగిడి: మండలంలోని బూరాడ గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు వావిలపల్లి బంగారినాయుడు(101) అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. వారంరోజుల క్రితం వరకూ ఆయన ఆరోగ్యంగానే ఉండేవారు. ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఆయన 35 సంవత్సరాల పాటు బూరాడ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా సేవలు అందించారు. అన్ని వర్గాలు, పార్టీల మన్ననలు పొందారు. ప్రస్తుతం ఆయన కుమారుడు వావిలపల్లి జగన్మోహనరావు రేగిడి మండల వైస్ ఎంపీపీగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రేగిడి మండల అధ్యక్షుడిగా ఉన్నారు. ఆయన మృతి పట్ల వైఎస్సార్‌సీపీ కేంద్ర పాలకమండలి సభ్యుడు పాలవలస రాజశేఖరం, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ రాజాం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, ఎంపీపీ దార అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు తదితరులు జగన్మోహనరావును కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


చంద్రశేఖర్ మృతదేహం

రామభద్రపురం: మండలకేంద్రంలోని వసంతల వీధికి చెందిన ఓ వ్యక్తి విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు వసంతుల వీధికి చెందిన పూడి చంద్రశేఖర్(38) కొంత కాలం నుంచి ఫిట్స్ వ్యాధితో పడుతుండేవాడు. దీంతో మనస్తాపానికి గురై మంగళవారం ఉదయం బాత్ రూమ్‌కు వినియయోగించే యాసిడ్ తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబసభ్యులు ప్రథమ చికిత్స నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖలోని కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతునికి భార్య రాజేశ్వరి, కుమార్తె రిత్విక, మోక్షిత్ ఉన్నారు. మృతుని తమ్ముడు మురళీకృష్ణ ఫిర్యాదుమేరకు ఏఎస్సైరమణ కేసునమోదు చేశారు.

పశువుల శాలకు నిప్పుపెట్టిన దుండగులు

గంట్యాడ: మండలంలోని వసంత గ్రామంలో చలుమూరి అప్పారావుకు చెందిన పశువుల శాలకు మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో శాల కాలి బూడిదైంది. శాల బయటకట్టి ఉన్న ఆవు పొట్టపై నిప్పురవ్వలు పడడంతో కొంత మేర ఆవుకు గాయాలయ్యాయి. గతంలో కూడా ఇదే ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు పశువులశాలకు నిప్పు పెట్టడంతో రెండు ఆవులు చనిపోయాయి.

అంగన్‌వాడీలకు మెమోలు జారీ

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీలకు వచ్చే పిల్లలకు మధ్యాహ్నం 12 గంటల వరకు వంట చేయలేదనే అంశంపై 'అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకలి కేకలు' అనే శీర్షికన 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బందికి మెమోలు జారీ చేసినట్టు సీడీపీఓ ప్రసన్న తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹210

అదరగొట్టిన అక్కాచెల్లెళ్లు

- అంతర్జాతీయ వేదికపై సత్తా చాటిన వెయిట్ లిఫ్టర్లు
- కామన్‌వెల్త్ చాంపియన్‌షిప్‌లో పతకాలు


సాధించిన పతకాలను చూపిస్తున్న బెల్లాన హారిక, భార్గవి

నెల్లిమర్ల రూరల్: వెయిట్ లిఫ్టింగ్ అంటే ఠక్కున గుర్తొచ్చే ఊరి పేరు నెల్లిమర్ల మండలంలోని కొండవెలగాడ. ప్రతిభ ఉంటే వేదికతో సంబంధం లేదని నిరూపిస్తున్నారు ఆ గ్రామానికి చెందిన క్రీడాకారులు. పలు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటి పతకాలు సాధిస్తూ జిల్లా, గ్రామం పేరును ఇనుమడిస్తున్నారు. ఈ నెల 16 నుంచి 20 వరకు ఫిజి దేశంలో జరుగుతున్న యూత్ జూనియర్ అండ్ సీనియర్ కామన్‌వెల్త్ పోటీల్లో కొండవెలగాడకు చెందిన బెల్లాన శ్రీను, గౌరీ దంపతుల కుమార్తెలు బెల్లాన భార్గవి, హారిక ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొన్నారు. ఈ క్రమలో మంగళవారం రాత్రి జరిగిన పోటీల్లో భార్గవి 49 కేజీల విభాగంలో స్నాచ్ 69 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్ 86 కిలోలు మొత్తం 155 కిలోల బరువును ఎత్తి రజత పతకాన్ని కైవసం చేసుకుంది. అలాగే బుధవారం జరిగిన పోటీల్లో హారిక 64 కేజీల విభాగంలో స్నాచ్ 81 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్ 105 కిలోలు మొత్తం 186 కేజీల బరువును ఎత్తి రెండు రజత పతకాలను దక్కించుకుంది. అంతర్జాతీయ వేదికపై సత్తా చాటిన అక్కాచెల్లెళ్లను రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోషియేన్ ప్రెసిడెంట్ నీలం శెట్టి శ్రీలక్ష్మి, జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ లక్క కార్యదర్శి చల్లా రాము, కోచ్ వల్లూరి శ్రీనివాసరావు, తదితరులు అభినందించారు.

స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా జట్లు సిద్ధం

- అండర్-14, 17 విభాగాల్లో 44 మంది క్రీడాకారుల ఎంపిక


రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ పోటీలకు జిల్లాస్థాయిలో నిర్వహించిన ఎంపిక పోటీలకు అనూహ్య స్పందన లభించింది. జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ స్టేడియంలో నిర్వహించిన పోటీలను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. అండర్-14,17 వయస్సుల విభాగాల్లో బాల, బాలికలకు నిర్వహించిన ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 350 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్కంఠ భరితంగా సాగిన పోటీల్లో అండర్-14 బాలుర జట్టుకు 11 మంది క్రీడాకారులు, బాలికల జట్టుకు 11 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. అదేవిధంగా అండర్-17 విభాగంలో బాలుర జట్టుకు 11 మంది క్రీడాకారులు, బాలికల జట్టుకు 11 మంది క్రీడాకారులు అర్హత సాధించారు. అండర్-14 విభాగంలో ఎంపికైన క్రీడాకారులు సత్యసాయి జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో, అండర్-17 విభాగంలో ఎంపికైన క్రీడాకారులు పల్నాడులో జరగనున్న అంతర్ జిల్లాల పోటీల్లో విజయనగరం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఎంపిక పోటీలను జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ప్రతినిధులతో పాటు పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

ఆక్రమణల తొలగింపులో 'మాన్సాస్'

- ధర్మపురిలో రూ.30లక్షల విలువచేసే భవనం కూల్చివేత
- విలపించిన బాధిత కుటుంబం


ధర్మపురి ప్రాంతంలో పైడికొండ నిర్మించిన భవనాన్ని కూల్చివేస్తున్న దృశ్యం


కన్నీరు మున్నీరవుతున్న బాధిత కుటుంబ సభ్యులు

విజయనగరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆక్రమణల తొలగింపు పేరిట మాన్సాస్ ట్రస్ట్ దూకుడు పెంచింది. మాజీ కేంద్ర మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ట్రస్ట్ ఆస్తుల పరిరక్షణకు దశాబ్దాలుగా పట్టించుకోకుండా వదిలేసిన అధికారులు తాజాగా ఆక్రమణల దారులకు గతంలో నోటీసులు జారీ చేశామని, వారి నుంచి స్పందన లేకపోవడంతో తొలగింపు చర్యలు చేపడుతున్నట్టు చెప్పుకొస్తున్నారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ధర్మపురి ప్రాంతంలో కొరువాడ పైడికొండ అనే వ్యక్తి నిర్మించుకున్న రెండు అంతస్తుల భవనాన్ని పోలీస్‌బందోబస్తు నడుమ జేసీబీతో మాన్సాస్ అధికారులు బుధవారం కూల్చివేశారు. సుమారు రూ.30 లక్షల విలువైన భవనాన్ని కూలిచ్చేయడంతో పైడికొండ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. వాస్తవానికి భవన నిర్మాణ సమయంలో ట్రస్ట్‌కు సంబంధించిన వారెవ్వరూ పట్టించుకున్న దాఖలాలులేవు. కేవలం నోటీసులు జారీ చేసినట్టు చెబుతున్నారు. అధిక వ్యయంతో భవనాన్ని నిర్మించిన అనంతరం కూల్చివేయడం పైడికొండ కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్రీడల్లో రాణించేవారికి ఉజ్వల భవిత

పూసపాటిరేగ: క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈఓలు ఎ.రాజ్‌కుమార్, బి.పాపినాయుడు అన్నారు. మండలంలోని వెంపడాం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల క్రీడా మైదానంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) మండలస్థాయి క్రీడాపోటీలను వారు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన విద్యార్థులు ప్రభుత్వ కొలవులు సాధిస్తున్నారన్నారు. గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు మండల స్థాయి క్రీడలు దోహదపడతాయన్నారు. మొదటిరోజు అథ్లెటిక్స్, కబడ్డీ, యోగా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మయ్య, వెంపడాం, కొవ్వాడ సర్పంచ్‌లు పిన్నింటి కుమార్, కోట్ల రఘు, మాజీ సర్పంచ్ పిన్నింటి శ్రీనివాసరావు, ఎల్లం నాయుడు, కొరటాన చినఅప్పలనాయుడు, వాళ్లె అప్పలనాయుడు, పి.సీతంనాయుడు, రాము నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గురజాడ జయంతిని ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: మహాకవి గురజాడ వెంకట అప్పారావు 162 వ జయంతి ఉత్సవాలను ఈ నెల 21న ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ బీఆర్. అంబేడ్కర్ సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన తన చాంబర్‌లో గురజాడ జయంతి ఉత్సవాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జయంతి రోజున గురజాడ గృహం వద్ద ఉదయం 9 గంటలకు మహాకవి గురజాడ విగ్రహానికి పూలమాలాంకరణ గావించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా గురజాడ గృహాన్ని, గురజాడ సెంటర్‌లో ఉన్న విగ్రహాన్ని విద్యుత్ కాంతులు, పూలమాలలతో అలంకరించాలని కార్పొరేషన్ కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. జయంతి ఉత్సవాలకు ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు హాజరవుతారని, గురజాడ అభిమానులు, సాహితవేత్తలు, విద్యార్థులు ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఆహ్వాన పత్రాలు అందరికీ అందేలా చూడాలని డీఆర్వో అనితకు సూచించారు.

పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి

- జేసీ సేతుమాధవన్


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో నవంబర్ రెండో వారం నుంచి పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ అధికారులను ఆదేశించారు. తన చాంబర్‌లో పత్తి కొనుగోలుపై బుధవారం సమీక్షించారు. జిల్లాలో సుమారు 1574 హెక్టార్లలో పత్తిపంట సాగువుతోందని, ఈ నెల 23లోగా ఈ క్రాప్ నమోదు పూర్తిచేయాలని ఆదేశించారు. రాజాం, రామభద్రపురంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ ఏడాది క్వింటాకు రూ.7,521గా మద్దతు ధరను కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిర్ణయించిందన్నారు. తేమశాతం నిర్ణీత 8 శాతం కంటే ఎక్కువగా ఉంటే మద్దతు ధర క్రమంగా తగ్గుతుందని తెలిపారు. తేమ 12 శాతం కంటే ఎక్కువగా ఉంటే కొనుగోలు చేయడం కుదరదని స్పష్టంచేశారు. రైతులు పత్తిలో తేమశాతం తక్కువగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులందరూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో పత్తి విక్రయాలు జరిపి మద్దతు ధర పొందాలన్నారు. జిల్లాలో ఈ ఏడాది సుమారు 1900 మెట్రిక్ టన్నుల పత్తి పండే అవకాశం ఉందన్నారు. సమావేశంలో మార్కెటింగ్ ఏడీ బి.రవికుమార్, జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు, జిల్లా అగ్నిమాపక అధికారి బి.రామ్‌ప్రమాస్, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ పి.వి. రంగారెడ్డి, ఆర్టీఓ ఎస్.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన విజిలెన్స్ ఎస్పీ


ఎస్పీ వకుల్ జిందాల్‌కు పూలమొక్కను అందజేస్తున్న విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు

విజయనగరం క్రైమ్: విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల విజిలెన్స్ ఎస్పీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన బర్ల ప్రసాదరావు బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. 1989వ బ్యాచ్ సబ్ ఇన్స్పెక్టర్‌గా పోలీసు శాఖలో అడుగుపెట్టిన బర్ల ప్రసాదరావు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ రూరల్, విశాఖ సిటీలో వివిధ హోదాల్లో పనిచేశారు. రాష్ట్ర డీజీపీ కార్యాలయంలోని టెక్ టవర్స్, కోస్టల్ సెక్యూరిటీ, విశాఖ సిటీలో ఏసీపీగా, అదనపు ఎస్పీగా పనిచేసి, ఇటీవల నాన్ క్యాడర్ ఎస్పీగా ఉద్యోగోన్నతి పొందారు.

స్వచ్ఛత హి సేవలో..


భోగాపురం గంగరాల చెరువుగట్టుపై చెత్త తొలగింపులో కలెక్టర్, ఎమ్మెల్యే

భోగాపురం: ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. భోగాపురంలోని గంగరాల చెరువు గట్టుపై బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చెరువు గట్టుపై పేరుకుపోయిన చెత్తను, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశుభ్రమైన, స్వచ్ఛమైన గ్రామాలే లక్ష్యంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి, జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, సర్పంచ్ ఉడికల అప్పయ్యమ్మ, తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, ఈఓపీఆర్డీ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దుదాం

విజయనగరం: పోస్టర్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య బుధవారం ఓ ప్రకటనలో కోరారు. నగర పరిధిలో ఎక్కడా పోస్టర్లు, గోడలపై రాతలు చేపట్టరాదన్నారు. పోస్టర్లు అతికించేవారి నుంచి రూ.5వేలు అపరాధ రుసుం వసూలు చేస్తామని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించి పోస్టర్లు అతికించిన సంస్థ నుంచి రూ.5వేలు అపరాధ రుసుము విధించి వసూలు చేశామని చెప్పారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జీఎంఆర్ ఐటీ విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

రాజాం/రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ ఐటీ విద్యార్థులు అంతర్ జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీలో చక్కని ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్ మంగళవారం తెలిపారు. ఈ నెల 14 నుంచి 16 వరకు అమలాపురంలోని ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో నిర్వహించిన పోటీల్లో జూనియర్, సబ్‌జూనియర్ పోటీల్లో విభాగాల్లో విజయనరం జిల్లా తరఫున జీఎంఆర్ ఐటీ విద్యార్థులు పాల్గొన్నారన్నారు. జూనియర్ విభాగానికి సంబంధించి 63 కేజీల విభాగంలో ఎస్.కృష్ణవేణి, 52 కేజీల విభాగంలో బి.నిహారికలు బంగారు పతకాలు, అలాగే సబ్ జూనియర్ విభాగానికి సంబంధించి 63 కేజీల విభాగంలో ఎస్.రిచిత, 59 కేజీల విభాగంలో వి.శరత్ బంగారు పతకాలు కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఓవరాల్ చాంపియన్ షిప్‌లో సబ్ జూనియర్ పురుషుల జట్టు మొదటి స్థానం సాధించగా జూనియర్, సబ్‌జూనియర్ మహిళల జట్లు తృతీయ స్థానంలో నిలిచాయని వివరించారు. 59 కేజీల విభాగంలో పి.సూరజ్‌కుమార్, 52 కేజీల విభాగంలో జి.సాత్విక సిల్వర్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. 105 కేజీల విభాగంలో జి.నవదీప్ సబ్ జూనియర్ విభాగంలో, ఎస్.సాయిసుధీర్ జూనియర్ విభాగంలో, 76 కేజీల జూనియర్ విభాగంలో పి.దీపిక, 52 కేజీల జూనియర్ విభాగంలో పి.గాయత్రిరెడ్డిలు రజత పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిభపట్ల ప్రిన్సిపాల్‌తో పాటు ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, స్టూడెంట్స్ డీన్ డాక్టర్ వి.రాంబాబు, పీడీ డాక్టర్ బి.అరుణ్‌కుమార్‌లు అభినందించారు.

సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి..!

- ఆన్‌లైన్ వర్క్ పేరుతో పోగొట్టుకున్న డబ్బులు
- అకౌంట్ నుంచి రూ.7.50 లక్షలు మాయం
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

రాజాం సిటీ: ప్రజల అవసరాలను బలహీనతగా చేసుకున్న సైబర్ నేరగాళ్లు కొత్త పంథాలు అనుసరించి మాయలవలను విసురుతున్నారు. ఎలాగోలా సెల్‌ఫోన్ వేదికగా బురిడీ కొట్టించి జేబులు గుల్ల చేస్తున్నారు. ఇటువంటి ఘటనే టెలిగ్రాం వేదికగా ఏకంగా ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని బురిడీ కొట్టించి రూ.7.50లక్షలు కాజేశారు. వివరాల్లోకి వెలితే టెలిగ్రాంలో పరిచయమైన అపరిచితుడు పంపిన లింకును క్లిక్ చేసి పట్టణ పరిధిలోని తెలగవీధికి చెందిన బి.వెంకటేష్ అనే వ్యక్తి సైబర్ వలకు చిక్కి ఏకంగా రూ.7.50 లక్షలు పోగొట్టుకున్నాడు. దీనికి సంబంధించిన అందిన ఫిర్యాదు మేరకు టౌన్ సీఐ కె.అశోక్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణ పరిధిలోని తెలగవీధికి చెందిన వెంకటేష్ కొన్నాళ్లుగా హైదరాబాద్‌లో ఉంటూ ఓ కన్సల్టెన్సీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తున్నాడు. అయితే తన తల్లికి అనారోగ్యం కారణంగా నెల రోజుల క్రితం రాజాం వచ్చి వర్క్‌ఫ్రం హోం చేస్తున్నాడు. ఈ క్రమంలో టెలిగ్రాం అకౌంట్‌లో అపరిచిత వ్యక్తి పరిచయమయ్యాడు. ఈ నెల 12న గాయత్రిపీసా అనే అకౌంట్ నుంచి ప్రొడక్ట్ ప్రమోషన్ పార్ట్‌టైం జాబ్ ఉందని మెసేజ్ వచ్చింది. ఇన్విటేషన్ కోడ్ ద్వారా లాగిన్ అవ్వాలని ఒక లింకు పంపారు. దీంతో లాగిన్ అయిన తరువాత రూ.10వేలు జమచేశాడు. వెంటనే సదరు నేరగాళ్లు ఆయనకు రూ.900లు కమిషన్ ఇవ్వగా ఈ మొత్తాన్ని తన యూనియన్ బ్యాంకుకు ట్రాన్స్‌ఫర్ చేశాడు. తరువాత రోజు లాగిన్ కాకపోవడంతో గాయత్రి పేరుతో సదరు వ్యక్తి వాట్సాప్ నంబర్‌కు ఏమైనా సమస్య ఉందా లాగిన్ కాలేదని మెసేజ్ చేశారు. దీంతో మళ్లీ లాగిన్ అయి రూ. 10వేలు డిపాజిట్ చేశాడు. దానికి మళ్లీ రూ. 4వేలు కమిషన్ ఇచ్చారు. 15వతేదీన రూ. 33వేలు జమచేయగా రూ.7వేలు కమిషన్ ఇచ్చారు. మొత్తం రూ.40వేలను బ్యాంకు నుంచి విత్‌డ్రా చేశాడు.

తక్కువ మొత్తానికి ఎక్కువ బోనస్..!

ఆ తరువాత టెలిగ్రాం కస్టమర్ ఐడీల ద్వారా లింకులు పంపించి తక్కువ మొత్తంలో జమచేస్తే ఎక్కువ మొత్తంలో బోనస్ ఇస్తామని చెప్పడంతో ఆశపడిన సదరు వ్యక్తి తన వద్ద ఉన్న మొత్తాన్ని తన బ్యాంకు అకౌంట్‌లు, యూపీఐలతోపాటు పలు విధాలుగా సైబర్ నేరగాళ్లకు 7,49,338లు చెల్లించాడు. అనంతరం ప్రమోషన్ వర్క్ చేయగా ఎంకే (మిచెల్ కోర్స్) కంపెనీలో క్రియేట్ చేసిన అకౌంట్‌లో రూ.2,81,724లు బోనస్‌తో కలిపి రూ.10,31,062లు చూపించింది. వాటిని విత్ డ్రా చేసేందుకు ప్రయత్నించగా రూ. 5,15,531లు అదనంగా డిపాజిట్ చేయాలని కస్టమర్ సర్వీసెస్ ద్వారా మెసేజ్ వచ్చింది. దీంతో అనుమానం వచ్చిన ఆయన ఈ నెల 16న రాత్రి 10 గంటల సమయంలో సైబర్ క్రైం నంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు. అనంతరం బుధవారం పోలీస్‌స్టేషన్ వచ్చి సదరు ఎంకే ప్రమోషన్స్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడని సీఐ అశోక్ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అపరిచిత లింకులు క్లిక్ చేసి మోసపోవద్దని హితవు పలికారు. సైబర్ నేరగాళ్ల వలకు చిక్కకుండా జాగ్రత్తపడాలని సూచించారు.

వినాయక లడ్డూ రూ.40వేలు

భోగాపురం: మండలంలోని దల్లిపేట గ్రామంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణపతి లడ్డూకు కమిటీసభ్యులు బుధవారం వేలంపాట నిర్వహించారు. గ్రామానికి చెందిన దల్లి రామగోవింద్ రూ.40 వేలుకు లడ్డూను దక్కించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దల్లి కాంత, గ్రామ పెద్దలు శ్రీనివాసరావు, రామకృష్ణ, కనకారావు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.31,470లు విరాళం

విజయనగరం ఫోర్ట్: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు రోజువారీ రైల్వే ప్రయాణికులు ఉదారంగా ఆర్థిక సహాయం అందించారు. వివిధ వృత్తుల్లో పనిచేస్తూ శ్రీకాకుళం నుంచి విజయనగరానికి రైలులో రాకపోకలు సాగించేవారు పోగుచేసిన రూ.31,470ల చెక్కును కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు బుధవారం అందజేశారు.

కానిస్టేబుల్ ధైర్యసాహసాలతో పోలీస్‌శాఖకు ప్రతిష్ట

- కానిస్టేబుల్‌ను అభినందించిన ఎస్పీ వకుల్‌జిందాల్


కానిస్టేబుల్ కృష్ణను అభినందిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: టూటౌన్ పరిధిలో కానిస్టేబుల్ పి.కృష్ణ విధి నిర్వహణలో కనబర్చిన ధైర్యసాహసాలను ఎస్పీ వకుల్ జిందాల్ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆగస్టు 24న సాయంత్రం పూల్‌బాగ్ కాలనీ పీజీ కళాశాల సమీపంలో కొందరు యువకులు గంజాయి సేవించి, మత్తులో చుట్టుపక్కల ప్రజలకు ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ డయల్ 100కి కాల్ వచ్చింది. వెంటనే టూటౌన్ కానిస్టేబుల్ పి.కృష్ణ, హెచ్‌సీ జనార్ధనరావు సంఘటనా స్థలానికి వెళ్లారు. అక్కడ యువకులు ప్రజలను తూలనాడుతూ, వారిపై దురుసుగా ప్రవర్తిస్తున్నారు. వారిని నియంత్రించే సమయంలో మత్తులో వారు పోలీసులపైకి దాడికి ప్రయత్నించారు. కానిస్టేబుల్ కృష్ణ తన ప్రాణాలను లెక్కచేయకుండా వారితో తలపడి, మత్తులో ఉన్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సమర్ధవంతంగా పనిచేసి, పోలీస్‌శాఖ ప్రతిష్టను ఇనుమడింపజేశారని నాటి ఘటనను ఎస్పీ వివరించారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

15 కిలోల గంజాయి స్వాధీనం

- ఆరుగురు నిందితుల ఆరెస్ట్


నిందితులను విలేకరుల ముందు ప్రవేశపెట్టిన డీఎస్పీ శ్రీనివాసరావు

మెరకముడిదాం: మండలంలోని గాదెలమర్రివలస గ్రామం జంక్షన్ లో గంజాయితో పట్టుబడిన ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఈ మేరకు ఆయన స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ బుదరాయవలస ఇన్‌చార్జ్ ఎస్సై బి.లోకేశ్వరరావు సిబ్బందితో వాహనాల తనిఖీ చేస్తుండగా సిగిరివెంకటేష్, జరజాన శ్రీరామ్, బైక్‌పై వస్తుండగా వారిని ఆపి రికార్డులు గురించి ఆరా తీస్తున్నారు. అదే సమయంలో వెనక నుంచి ఆటోలో వస్తున్న నలుగురు వ్యక్తులు ఆటో దిగి పరుగు తీశారు. ఇది గమనించిన పోలీసులు వెంటనే స్పందించి ఆ నలుగురిని పట్టుకుని ఆటో తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. ఆటోలో గంజాయిని తరలిస్తున్న వెంకటేష్ (రంగపువలస) జరజాన శ్రీరామ్ (పెరుమాళి) అలాగే పాచిపెంట మండలం ఏసుపురం గ్రామానికి చెందిన పిడిసి చిన్నారావు, రాజాం మండలం ఒమ్మి గ్రామానికి చెందిన ఒప్పింటి నాగరాజు, మెరకముడిదాం మండలం గాదెలమర్రివలస గ్రామానికి చెందిన వలిరెడ్డి సత్యనారాయణలను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ శ్రీనివాసరావు వివరించారు. నిందితుల దగ్గర 15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఒక బైక్, ఒక ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చీపురుపల్లి సీఐ శంకర్రావు, బుదరాయవలస ఇన్‌చార్జ్ ఎస్సై బి.లోకేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

3 అక్రమ ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

- రూ.40వేల జరిమానా


అక్రమ ఇసుక రవాణా చేస్తూ పట్టుబడిన ట్రాక్టర్లు

బొబ్బిలిరూరల్: మండలంలోని అలజంగి గ్రామం వద్ద వేగావతి నది నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న 3 ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు.మంగళవారం అర్ధరాత్రి అలజంగిగ్రామం నుంచి బొబ్బిలికి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారన్న సమాచారాన్ని తెలుసుకున్న పోలీసులు గొల్లపల్లి వద్దనున్న స్థానిక దాడితల్లి అమ్మవారి గుడిసమీపంలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.బుధవారం తహసీల్దార్‌కు విషయం తెలియజేయగా ఆయన మొదటిసారిగా దొరికిన రెండు ట్రాక్టర్లకు రూ.10వేలు చొప్పున, రెండో సారి దొరికిన ఓ ట్రాక్టర్‌కు రూ. 20వేలు మొత్తం రూ.40వేలు జరిమానా విధించారు. మరో మారు ఇసుక అక్రమ రవాణాలో దొరికితే ఆర్‌సీ రద్దుచేస్తామని తహసీల్దార్ శ్రీను స్పష్టం చేశారు.